సమస్య

''ఏమండోయ్! మనకి పనిమనిషి కుదిరింది!'' గట్టిగా అరిచి చెప్పింది సావిత్రమ్మగారు. ''దానికంత గట్టిగా అరవాలేమిటే, ఏదో లాటరీలో బహుమతొచ్చిం దన్నట్టుగా వుందే ఏ వ్యవహారం!'' అంటూ అలవాటు గానే కసురుకున్నారు సత్యంగారు.

నిజానికి సావిత్రమ్మగారికి పనిమనిషి దొరకడం అనే విషయం చాలా గొప్పదే! ఎందుకంటే, సత్యంగారు పోస్టుమాస్టర్‌గా వూరూరా తిరుగుతుంటారు. ఆయన పనిచేసే వూళ్ళన్నీ చిన్న చిన్న పల్లెటూళ్ళే. ఆ వూళ్ళల్లో పనిమనిషి దొరక్క సావిత్రమ్మగారు వాపాయాతరా పడ్డారు. ఇన్నాళ్ళకి ఈ గుడివాడ పట్టణానికి వచ్చి, ఇక్కడ పనిమనిషిని పెట్టుకోవడం అంటే అది ఆ ఇల్లాలికి చాలా విశ్రాంతి కలుగజేసే విషయమయింది.

కొత్త పనిమనిషి వచ్చి పదిహేను రోజులయింది. పని బాగా చేస్తోంది. కష్టం, సుఖం అమ్మగారికి చెప్పుకుని ఆదరణ పొందుతోంది. ఇలా వుండగా, ఆ పనిమనిషి ఒక రోజున పెద్దగా కేకలు వేసుకుంటూ''నీ ఇంటి పని వద్దు నువ్వు వద్దు,,అని వెళ్ళిపోయింది. విషయమేమిటని అడిగేంత తీరుబడి సత్యంగారికి లేకపోయింది. అంత ఎక్కువగా ఆఫీస్ పనిబడిందాయనకి.

మరునాడు మళ్ళీ కొత్త మనిషి పని చేస్తుంటే చూసి, ఫరవాలేదనుకున్న సత్యంగారి సంతోషం ఎంతో కాలం నిలవలేదు. మళ్ళీ వారానికామ్మాయి మానే సింది. మరొక వడివయస్సు మనిషి పనిలోకి వచ్చింది. పది రోజులకల్లా అదీ పారిపోయింది.

ఈసారి సత్యంగారు ఉపేక్షించలేకపోయారు. సావిత్రమ్మగారెవరితో పోట్లాడే స్వభావం కాదు. అందరితోను ఎంతో కలుపుగోలుతనంగా వుంటుంది. మరి ఎక్కడుంది లోపం అన్న సందేహంతో ఆదివారం సత్యంగారు తన గృహిణిని పిలిచి సంగతి సందర్భం అడిగారు. ''ఏం చెప్పనండీ! మొదటి పనిమనిషిని మొగుడు తాగివచ్చి రోజూ చితకబాదేవాడని ఏడుస్తూ వాడిని తిడుతూ నాతో చెప్పుకునేది. నాతలు తేలిన దాని వళ్ళు చూసి నేను జాలిపడి,'వాడికేం పోయే కాలం వచ్చిందే, ఇట్లా కొట్టాడు. ఈ దెబ్బలు పోలీసులకి చూపించి వాణ్ణి జైలుకు పంపించు. రోగం కుదురుతుంది వెధవకి''అన్నాను. అంతే! దానికెంత కోపం వచ్చిందనీ! ఏవమ్మో మా ఆయన్ని నేను తిట్టుకుంటాను కానీ, నువ్వెందుకు తిడతావు? పైగా జైలుకు పంపమంటావు! చాల్చాల్లేవమ్మా!' అంటూ వెళ్ళిపోయింది. ఇదిలా అంది కదాని రెండో పనిమనిషి మొగుడిమీద ఫిర్యాదులు చెప్పినప్పుడు 'మొగవాళ్ళంతేనే, మనమే సర్దుకుపోవాల న్నాను. ఆ మాటకి దానిక్కోపం వచ్చి, 'నీ మొగుడు కొడితే నీకు తెలుస్తుంది. సర్దుకుపోవాలట, సర్దుకుపోవడం... అని అది మాటేసింది. నీళ్ళిద్దరి అనుభవంతో మూడో మనిషి ఏం చెప్పినా విని వూరుకున్నాను. అది దానికి తప్పయింది. 'ఏం అమ్మ, నాటి ఆడదానివని కష్టం సుఖం చెప్పుకుంటే, హాయ్ కయ్ మనవు. నీ ఎదురుగా నన్ను ఎవరు పంపినా దిక్కులేదు. నీ పని వద్దులేమ్మా! ' అని అది వెళ్ళిపోయిందండి. ఇప్పుడు నన్నేం చేయమంటారో మీరే చెప్పండి? ' అన్నది సావిత్రమ్మగారు.

— టి.ప్రభావతి

జలుబుల నుంచి శీఘ్రనివారణ